నమస్తే తెలంగాణ
# జగిత్యాల
5 | కరీంనగర్, ఆదివారం 28 ఏప్రిల్ 2024 | JAGTIAL

## ఆవిర్భావ దినోత్సవం..
# అదరహో

ఘనంగా బీఆర్ఎస్ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు



కేసీఆర్ భవన్‌లో జెండా ఎగురేస్తున్న ఎమ్మెల్యే గంగుల కమలాకర్, పక్కన జడ్పీ చైర్‌పర్సన్ కనుమల్ల విజయ, మేయర్ సునీల్‌రావు, తదితరులు

బీఆర్ఎస్ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను శనివారం ఉమ్మడి కరీంనగర్ జిల్లా వ్యాప్తంగా పార్టీ నాయకులు, కార్యకర్తలు ఘనంగా నిర్వహించారు. గులాబీ జెండాలను ఆవిష్కరించి, స్వీట్లు పంపిణీ చేశారు. కరీంనగర్ శివారులోని తీగలగుట్టపల్లిలో గల కేసీఆర్ భవన్‌లో ఎమ్మెల్యే గంగుల కమలాకర్, జడ్పీ చైర్‌పర్సన్ కనుమల్ల విజయ, పార్టీ జిల్లా అధ్యక్షుడు జీవీ రామకృష్ణారావు, సిరిసిల్లలో పార్టీ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య, జడ్పీ చైర్‌పర్సన్ న్యాలకొండ అరుణ, నాఫ్స్‌కాబ్ చైర్మన్ కొండూరు రవీందర్‌రావు, జగిత్యాలలో పార్టీ జిల్లా అధ్యక్షుడు కల్వకుంట్ల విద్యాసాగర్‌రావు, జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్‌కుమార్, జడ్పీ చైర్‌పర్సన దావ వసంత, పెద్దపల్లిలో పార్టీ జిల్లా అధ్యక్షుడు కోరుకంటి చందర్, మాజీ ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డి పాల్గొన్నారు.

**- నమస్తే నెట్‌వర్క్, ఏప్రిల్ 27**

# ప్రజల గొంతుకగా పనిచేస్తాం

- భూమి ఉన్నంతకాలం బీఆర్ఎస్ ఉంటుంది
- తెలంగాణ చరిత్రను ఎవరూ చెరిపేయలేరు
- పార్టీ ఆవిర్భావ దినోత్సవంలో మాజీ మంత్రి, ఎమ్మెల్యే గంగుల కమలాకర్

కార్పొరేషన్/ కరీంనగర్ రూరల్ ఏప్రిల్ 27: 'తెలంగాణ గడ్డపై భూమి, నీరు ఉన్నంతకాలం బీఆర్ఎస్ ఉంటుంది. రాష్ట్ర సాధనే ధ్యేయంగా ఏర్పాటు చేసిన పార్టీ ప్రజల గొంతుకగా పనిచేస్తుంది. ఎవరెన్ని కుట్రలు చేసినా తెలంగాణ చరిత్రను చెరిపివేయలేరు' అని మాజీ మంత్రి, కరీంనగర్ ఎమ్మెల్యే గంగుల కమలాకర్ ఉద్ఘాటించారు. బీఆర్ఎస్ 23వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా తీగలగుట్టపల్లిలోని తెలంగాణ భవన్‌లో ఆయన పార్టీ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఉద్యమనేత కేసీఆర్ ప్రజల చిరకాల వాంఛ అయిన తెలంగాణ సాధన కోసం పార్టీని ఏర్పాటు చేశారని చెప్పారు. అంతేగానీ పదవుల కోసమో, అధికారాన్ని అనుభవించేందుకు కాదన్నారు. కేసీఆర్ సారథ్యంలో 14 ఏండ్లు నిజాయితీగా పోరాటం చేశామన్నారు. ఆయన కరీంనగర్ వేదికగా 'కేసీఆర్ సచ్చుడో..తెలంగాణ వచ్చుడో' పిలుపునిచ్చారని గుర్తుచేశారు. రెండు దశాబ్దాలకు పైగా ప్రజా సమస్యల పరిష్కారం కోసం పనిచేశామని చెప్పారు. పదేండ్ల బీఆర్ఎస్ పాలనలో అద్భుతమైన ఫలితాలు సాధించామని, అభివృద్ధి, సంక్షేమ పథకాలతో ప్రజల బతుకుల్లో వెలుగులు నింపామని పేర్కొన్నారు. ఇప్పుడు ప్రతిపక్షంగా ప్రజల తరపున నిలబడి పోరాటం చేస్తామని స్పష్టంచేశారు. లోక్‌సభ ఎన్నికల్లో కరీంనగర్ గడ్డపై గులాబీ జెండా ఎగరడం ఖాయమన్నారు. నాలుగు నెలల్లో రాష్ట్రంలో బీఆర్ఎస్ అధికారంలో లేని లోటు కనిపిస్తుందన్నారు. పోరాడి తెలంగాణ తెచ్చిన పార్టీగా పదేళ్లలో అనేక సంక్షేమ ఫలాల్ని అందించిన పార్టీగా ప్రజల్లో మంచి ఆదరణ లభిస్తుందని చెప్పారు. కార్యక్రమంలో జడ్పీ చైర్‌పర్సన్ కనుమల్ల విజయ, మేయర్ యాదగిరి సునీల్‌రావు, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు జీవీ రామకృష్ణారావు, మాజీ ఎమ్మెల్సీ నారదాసు లక్ష్మణ్‌రావు, మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్, బీఆర్ఎస్ నగరాధ్యక్షుడు చల్ల హరిశంకర్, కార్పొరేటర్లు కుర్ర తిరుపతి, గంట కళ్యాణి, కొత్తపల్లి మున్సిపల్ చైర్మన్ రుద్ర రాజు, జిల్లా గ్రంథాలయ మాజీ చైర్మన్ పొన్నం అనిల్, కరీంనగర్ రూరల్ పార్టీ మండలాధ్యక్షుడు పెండ్యాల శ్యాంసుందర్‌రెడ్డి, నాయకులు కంసాల శ్రీనివాస్, పెండ్యాల మహేశ్, ఉదారపు మారుతి, తిరుపతి, రాజు, ఆరె రవి, జువ్వాడి రాజేశ్వర్‌రావు తదితరులు పాల్గొన్నారు.



వివరాలను వెల్లడిస్తున్న ఎస్పీ అఖిల్ మహాజన్

## కంబోడియాలో జాబ్ ఎర..
# నమ్మితే మునుగుడే

సిరిసిల్ల తెలంగాణ చౌక్, ఏప్రిల్ 27: అంతర్జాతీయ నకిలీ ఏజెంట్ల ముఠా గుట్టురట్టయింది. కంబోడియా దేశంలో కంప్యూటర్ ఆపరేటర్ ఉద్యోగాలిప్పిస్తామని యువకులకు వల వేసి, అక్కడ మాత్రం సైబర్ క్రైం కోరల్లోకి నెట్టివేస్తున్న బాగోతం బయటపడింది. వినకుంటే ముప్పులు తిప్పలు పెట్టడమే కాదు, పాస్‌పోర్టు ఇవ్వకుండా వేధిస్తున్నట్టు తెలుస్తున్నది. జిల్లాకు చెందిన ఓ బాధితుడి ఫిర్యాదుతో రంగంలోకి దిగిన పోలీసులు ఇద్దరిని అరెస్ట్ చేశారు. ఈ మేరకు శనివారం జిల్లా కేంద్రంలోని పోలీస్ కార్యాలయంలో ఎస్పీ అఖిల్ మహాజన్ వివరాలు వెల్లడించారు. సిరిసిల్ల పట్టణంలోని పెద్దూరుకు చెందిన అతికం శివప్రసాద్ డిగ్రీ దాకా చదువుకున్నాడు. ఉపాధి కోసం చూస్తున్నాడు. ఈ క్రమంలో కొడిమ్యాలకు చెందిన కంచర్ల సాయి ప్రసాద్ అనే ఏజెంట్‌ను సంప్రదించాడు. కంబోడియా దేశంలోని ఓ కంపెనీలో కంప్యూటర్ ఆపరేటర్ కొలువులు ఉన్నాయని, వీసా కోసం ₹1.40లక్షలు ఖర్చవుతాయని చెప్పడంతో శివప్రసాద్ అందజేశాడు. గత జనవరిలోనే కంబోడియా దేశం వెళ్లాడు. సాయిప్రసాద్ సూచించిన మేరకు అక్కడి ఓ చైనీస్ కంపెనీలో చేరాడు. వాళ్లు శివప్రసాద్ పాస్‌పోర్టు తీసుకొని కంప్యూటర్ ఆపరేటర్ కొలువు కాకుండా సైబర్ నేరాలు చేయిస్తున్నారు. ఈ క్రమంలో బాధితుడి తల్లి లక్ష్మి నాలుగు రోజుల కింద జిల్లా పోలీస్ కార్యాలయానికి వచ్చి తన కొడుకు మోసపోయాడని, కాపాడాలని వేడుకున్నది. ఈ క్రమంలో పోలీసులు వాట్సాప్ కాల్‌లో శివప్రసాద్‌తో మాట్లాడగా, అతను పూర్తి వివరాలు వెల్లడించాడు. తాను కంబోడియా వెళ్లిన తర్వాత తన పాస్‌పోర్టును చైనీస్ కంపెనీ లాక్కున్నదని చెప్పాడు. తనకు కంప్యూటర్ ఆపరేటర్ అని చెప్పినప్పటికీ.. అక్కడ కాల్ సెంటర్‌లో సైబర్ మోసాలు చేయిస్తున్నారని, ఇండియన్ నంబర్స్ ఇచ్చి లాటరీ, జాబ్ ఫ్రాడ్స్ చేయిస్తున్నారని వాపోయాడు. అధిక మొత్తంలో డబ్బులు ఇస్తామని ఆశ చూపుతున్నారని, టార్గెట్‌లు ఇచ్చి మరీ పని చేయిస్తున్నారని, ఒకవేళ వినకుంటే వేధిస్తున్నారని, తాము వెళ్తామన్నా పాస్‌పోర్టు ఇవ్వడం లేదని తెలిపాడు. తన లాగే భారత దేశానికి చెందిన సుమారు 500 నుంచి 600 మంది ఉన్నారని చెప్పాడు. వెంటనే సిరిసిల్ల టౌన్ ఠాణాలో కేసు నమోదు చేసిన పోలీసులు, కంబోడియాలో ఉన్న ఇండియన్ ఎంబసీ అధికారులను సంప్రదించారు. బాధితుడి వివరాలు అందించడంతో అక్కడి పోలీసులు శివప్రసాద్‌ను రెస్క్యూ చేశారని, రెండు రోజుల్లో ఇండియాకు చేరుకుంటారని ఎస్పీ వివరించారు. కాగా, ఈ కేసులో ప్రధాన సూత్రధారి ఏ1 నిందితుడైన కంచర్ల సాయి ప్రసాద్‌పై కేసు నమోదుచేసి అదుపులోకి తీసుకొని విచారించామని ఎస్పీ చెప్పారు. సాయిప్రసాద్ ₹10వేలు కమీషన్ తీసుకొని వీసా కోసం పాస్‌పోర్టును లక్నోకి చెందిన ఏ2 నిందితుడైన సదాకత్ (ప్రస్తుతం మాల్దీవుల్లో ఉంటున్నాడు)కు పంపించాడు. అతను పూణేకు చెందిన ఏ3 నిందితుడైన అబిద్ అన్సారీకి పంపించగా, ఆయన ఏ4 నిందితుడైన బీహార్ రాష్ట్రానికి చెందిన షాదాబ్ (ప్రస్తుతం దుబాయ్‌లో ఉంటున్నాడు)కు పంపించినట్టు వివరించారు. ఈ క్రమంలో షాదాబ్.. శివప్రసాద్‌ను కంబోడియా దేశానికి పంపినట్టు చెప్పారు. నలుగురు నిందితుల్లో కంచర్ల సాయి ప్రసాద్‌ను, పూణేలో ఉన్న ఆబిద్ అన్సారీని అదుపులోకి తీసుకున్నట్లు తెలిపారు. మిగితా ఇద్దరినీ త్వరలోనే పట్టుకోనున్నట్లు ఎస్పీ వెల్లడించారు. జిల్లా వ్యాప్తంగా నకిలీ ఏజెంట్ల ద్వారా మోసపోయిన బాధితులు నేరుగా స్పెషల్ బ్రాంచీ అధికారి 87126-56411ను సంప్రదించి ఫిర్యాదు చేస్తే చర్యలు తీసుకుంటామని సూచించారు.

## కొప్పుల గెలువాలని..

మోకాళ్లపై ఆలయం మెట్లు ఎక్కి బీఆర్ఎస్ మహిళా నాయకురాలి పూజలు

ధర్మారం, ఏప్రిల్ 26: ఖిలావనపర్తికి చెందిన బీఆర్ఎస్ మహిళా నాయకురాలు మమత పెద్దపల్లి అభ్యర్థి కొప్పుల ఈశ్వర్‌పై అభిమానం చాటుకున్నారు. ఆయన భారీ మెజార్టీతో విజయం సాధించాలని కోరుతూ శనివారం పార్టీ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని గ్రామంలోని శ్రీ లక్ష్మీనరసింహ స్వామి ఆలయం మెట్లు మోకాళ్లపై ఎక్కి పూజలు చేశారు. ఈశ్వర్ విజయానికి ఆ నృసింహస్వామి ఆశీస్సులు ఉండాలని ప్రార్థించినట్లు తెలిపారు.



ఖిలావనపర్తిలో మోకాళ్లపై ఆలయం మెట్లు ఎక్కుతున్న మమత

# బండివి డొల్ల మాటలే

- ఆయన గురించి కరీంనగర్ ప్రజలకు ఏనాడో తెలిసిపోయింది
- కేంద్రంలో అధికారంలో ఉన్నా ఎంపీగా చేసిందేమీ లేదు
- కాంగ్రెస్ మరోసారి మోసం చేయాలని చూస్తున్నది
- ఏ పార్టీ అధికారంలో ఉన్నా నిధులు తెచ్చేది వినోదే
- ఆయనను ఎంపీగా గెలిపించాల్సిన బాధ్యత మీపైనే ఉన్నది
- కరీంనగర్‌లో మాజీ మంత్రి, ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు



కరీంనగర్: కోతిరాంపూర్‌లో వృద్ధుడిని ఓటు అభ్యర్థిస్తున్న మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు, కరీంనగర్ పార్లమెంట్ బీఆర్ఎస్ అభ్యర్థి వినోద్‌కుమార్

కరీంనగర్, ఏప్రిల్ 27 (నమస్తే తెలంగాణ) : బండి సంజయ్ డొల్ల మాటల మనిషేనని, ఆయన గురించి కరీంనగర్ ప్రజలకు తెలిసి పోయిందని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు తీవ్రంగా విమర్శించారు. కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం ఉన్నా.. బండి చేసిందేమీ లేదని మండిపడ్డారు. మాటలు తప్ప చేసిందేమీ లేదన్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో వినోద్‌ను గెలిపిస్తే కేంద్రంలో ఏ పార్టీ అధికారంలో ఉన్నా నిధులు తెచ్చి కరీంనగర్‌ను అభివృద్ధి చేస్తారని చెప్పారు. ఆయనను ఎంపీగా గెలిపించుకోవాల్సిన బాధ్యత మనపై ఉందని, వచ్చే నెల 13వ తేదీ నాడు మీ ఓటుతో బీజేపీ, కాంగ్రెస్‌కు గుణపాఠం చెప్పి వినోద్‌ను గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. నరేంద్ర మోడీ అధికారంలోకి వచ్చిన తర్వాత దేశంలో ధరలు విపరీతంగా పెరిగాయని, రేవంత్ రెడ్డి సీఎం అయ్యాక రాష్ట్రంలో పాలనగాడి తప్పి నిత్యావసరాల ధరలు సైతం పెరిగాయని మండిపడ్డారు. అసెంబ్లీ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలు అమలు చేయకుండా దేవుళ్లపై ప్రమాణం చేసి పార్లమెంట్ ఎన్నికల్లో రేవంత్‌రెడ్డి పబ్బం గడుపుకోవాలని చూస్తున్నారని ఆగ్రహించారు. అసెంబ్లీ ఎన్నికల్లో బాండ్ పేపర్ల సెంటిమెంట్ రగిలించి ప్రజలను మోసం చేసినట్టు ఇప్పుడు అలా మోసం చేయడం కుదరదని స్పష్టం చేశారు. మరోసారి మోస పోయేందుకు ప్రజలు సిద్ధంగా లేరని అన్నారు. కరీంనగర్ జిల్లాకేంద్రంలోని ఎమ్మెల్యే గంగుల కమలాకర్ నివాసంలో శనివారం రాత్రి ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో హరీశ్‌రావు మాట్లాడారు. కాంగ్రెస్, బీజేపీ తీరుపై ధ్వజమెత్తారు. బీజేపీ, బీఆర్ఎస్ మ్యాచ్ ఫిక్సింగ్ అయ్యాయని సీఎం రేవంత్ రెడ్డి చేసిన వ్యాఖ్యలను తీవ్రంగా ఖండించారు. బీజేపీతో కుమ్మక్కయింది రేవంత్ రెడ్డి అని ఆరోపించారు. నాడు ఉప ఎన్నికల్లో హుజూరాబాద్‌లో బలహీనమైన అభ్యర్థిని నిలిపి పరోక్షంగా బీజేపీని గెలిపించింది ఆయనేనని చెప్పారు. ఇప్పుడు పార్లమెంట్ ఎన్నికల్లోనూ ఇదే వైఖరిని అవలంభిస్తున్నారని విమర్శించారు. నామినేషన్ల పర్వం ముగుస్తున్న సమయంలో కరీంనగర్ పార్లమెంట్ అభ్యర్థిని ప్రకటించడం వెనక ఆంతర్యం ఏంటని ప్రశ్నించారు. ఇక్కడ కూడా బలహీనమైన అభ్యర్థిని నిలబెట్టి పరోక్షంగా బీజేపీని గెలిపించే ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు. ప్రజల్లో సెంటిమెంట్‌ను రగిలించి పబ్బం గడుపుకోవాలని ఈ రెండు పార్టీలు చూస్తున్నాయని, ఈ విషయాన్ని కరీంనగర్‌తోపాటు రాష్ట్ర ప్రజలు గమనించారని చెప్పారు. కేసీఆర్ పదేళ్ల పాలనలో తాగు, సాగు నీరు, విద్యుత్ సమస్యలను పరిష్కరించి, అభివృద్ధిని పరుగులు పెట్టించారని, పేదల సంక్షేమం కోసం అనేక పథకాలు తెచ్చారని గుర్తు చేశారు. అలాంటి పార్టీని నిలబెట్టాల్సిన బాధ్యత, మళ్లీ గెలిపించాల్సిన బాధ్యత ప్రజలపైనే ఉన్నదని చెప్పారు. విజ్ఞులైన కరీంనగర్ ప్రజలు, మేధావులు, కవులు, రచయితలు, ఉద్యోగులు, ఉపాధ్యాయులు, విజ్ఞానవంతులు ఆలోచించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమాల్లో బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు జీవీ రామకృష్ణారావు, మాజీ ఎమ్మెల్సీ భానుప్రసాద్ రావు, మేయర్ వై సునీల్ రావు, కార్పొరేటర్ ఐలేందర్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

**వినోదన్నను గెలిపించండి**

వినోద్ విద్యావంతుడు, మేధావి, అభివృద్ధి సాధకుడు. ఆనాడు తెలంగాణ కోసం ఉద్యమంలో పని చేసిండు. ఎంపీగా కరీంనగర్‌కు ఎంతో చేసిండు. రైల్వేలైన్, స్మార్ట్ సిటీని సాధించిండు. వినోద్‌కుమార్ లాంటి వ్యక్తి కావాలని ప్రజలు కోరుకుంటున్నరు. మేధావులు, విజ్ఞులు అందరూ ఆలోచించాలి. కరీంనగర్ అభివృద్ధి కొనసాగాలన్నా.. మేలు జరగాలన్నా.. వినోదన్నను ఆశీర్వదించాలి. ఆయన గెలిస్తే పార్లమెంట్‌లో ప్రజా గొంతుక అయితడు. కేంద్రంలో ఏ పార్టీ అధికారంలో ఉన్న నిధులు తెస్తడు.

**- మాజీ మంత్రి హరీశ్‌రావు**



డప్పు కొడుతున్న ఎమ్మెల్యే గంగుల కమలాకర్, బీఆర్ఎస్ కరీంనగర్ పార్లమెంట్ అభ్యర్థి వినోద్‌కుమార్



## జన నీరాజనం

హరీశ్‌రావు ఇంటింటా ప్రచారానికి బ్రహ్మరథం

బీఆర్ఎస్ దూసుకెళ్తున్నది. పార్లమెంట్ ఎన్నికల ప్రచారాన్ని హోరెత్తిస్తున్నది. బీఆర్ఎస్ అభ్యర్థి బోయినపల్లి వినోద్‌కుమార్ తరపున స్థానిక ఎమ్మెల్యే గంగుల కమలాకర్‌తో కలిసి మాజీ మంత్రి హరీశ్ రావు శనివారం రాత్రి నగరంలో ప్రచారం చేయగా, జనం నీరాజనం పలికారు. 9వ డివిజన్ (రాంపూర్)లో ఇంటింటా ఓట్లు అభ్యర్థించగా, ఆడబిడ్డలు మంగళహారతులతో స్వాగతించారు. డివిజన్‌లోని పలు వీధుల్లోని వ్యాపార, వాణిజ్య సముదాయాల్లోనూ ప్రచారం చేయగా, స్థానిక ప్రజలు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా అభ్యర్థి వినోద్‌తో కలిసి హరీశ్‌రావు ఇల్లిల్లూ తిరుగుతూ.. ఆప్యాయంగా మాట్లాడారు. బీఆర్ఎస్ అధికారంలో ఉన్నపుడు పరిస్థితులు ఎలా ఉండేవని, ఇప్పుడు ఎలా ఉన్నాయని ప్రజలను అడిగి తెలుసుకున్నారు. కేసీఆర్ ఉన్నప్పుడే బాగుందని, ఇప్పుడు అలా లేదని స్థానికులు తెలుపగా.. ఉద్యమ నాయకుడు, మేధావి అయిన వినోద్‌కుమార్‌ను గెలిపించాలని విజ్ఞప్తి చేశారు.

# కొత్త ఓటర్లు 8,758




- కరీంనగర్ పార్లమెంట్‌లో పెరిగిన ఓటర్ల సంఖ్య
- అత్యధికంగా కరీంనగర్ అసెంబ్లీ సెగ్మెంట్‌లో 4,829 మంది
- అన్ని నియోజకవర్గాల్లో పెరిగితే చొప్పదండిలో మాత్రం 1,604 తగ్గుదల
- తాజాగా అనుబంధ జాబితా విడుదల
- ఇందులో పేరు ఉన్నవారే ఓటు హక్కు వినియోగించుకునే అవకాశం



కరీంనగర్ కలెక్టరేట్, ఏప్రిల్ 27: కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలో కొత్త ఓటర్లు పెరిగారు. ఓటర్ల జాబితా సవరణ 2024 ప్రకారం ఇప్పటివరకు 17,88,392 మంది ఓటర్లు ఉండగా, తాజాగా ఈసీ విడుదల చేసిన అనుబంధ జాబితా ప్రకారం 8,758 మంది అదనంగా చేరారు. దీంతో సెగ్మెంట్‌లో మొత్తం ఓటర్ల సంఖ్య 17,97,150కి పెరిగింది. వీరిలో 9,19,565 మంది మహిళలు, 8,77,483 మంది పురుషులు, 102 మంది ట్రాన్స్‌జెండర్లు ఉన్నారు. అత్యధికంగా కరీంనగర్ అసెంబ్లీ సెగ్మెంట్‌లో 4,829 మంది, సిరిసిల్ల నియోజకవర్గంలో 1432, హుస్నాబాద్‌లో 1,539, హుజూరాబాద్ సెగ్మెంట్‌లో 1161, వేములవాడలో 865, మానకొండూర్‌లో 536 మంది కొత్తగా ఓటర్లు నమోదయ్యారు. చొప్పదండి సెగ్మెంట్‌లో మాత్రం గత జాబితాలోని సంఖ్యకన్నా 1,604 మంది ఓటర్లు తగ్గారు. లోక్‌సభ ఎన్నికల దృష్ట్యా ఈ ఏడాది ఫిబ్రవరి 8న కేంద్ర ఎన్నికల సంఘం సవరించిన ఓటర్ల తుది జాబితా విడుదల చేసింది. అనంతరం కూడా అర్హులైన వారు దరఖాస్తు చేసుకునేందుకు ఎన్నికల నోటిఫికేషన్ వెలువడే మూడు రోజుల ముందు వరకు ఏప్రిల్ 15 నాటికి అవకాశం కల్పించింది. కొత్త ఓటర్లతో పాటు ఇతర ప్రాంతాల్లోని వారు తాము నివసిస్తున్న చోటనే ఓటు నమోదుకు దరఖాస్తు చేసుకున్నారు. అనంతరం వచ్చిన దరఖాస్తులను క్షేత్రస్థాయిలో పరిశీలించిన అధికారులు అర్హులైన వారిని గుర్తించి, ఓటర్లుగా నమోదు చేశారు. గతంలో ఓటరు నమోదులో జరిగిన నిర్లక్ష్యంతో ఎక్కువ శాతం తప్పుల తడకగా జాబితాలు రూపొందాయి. ఓటర్ల పేర్లు, తండ్రుల పేర్లు, చిరునామాలు, వయస్సు కూడా తప్పుగా నమోదు కావడం, మరికొంత మంది పేర్లు తొలగించడంతో వేల సంఖ్యలో ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకోలేకపోయారు. ఓటరు జాబితాల రూపకల్పనపై క్షేత్రస్థాయిలో అనేక విమర్శలు వచ్చాయి. దీంతో స్పందించిన ఎన్నికల సంఘం గత అసెంబ్లీ ఎన్నికల నుంచి ఓటర్ల నమోదు, తొలగింపుపై ప్రత్యేక డ్రైవ్ చేపట్టింది. అలాగే, కొత్త ఓటర్ల నమోదుపై కూడా దృష్టి పెట్టింది. ఆన్‌లైన్, ఆఫ్‌లైన్‌లో నమోదైన దరఖాస్తులను బూత్‌స్థాయి అధికారులు క్షేత్రస్థాయిలో ఇంటింటికి వెళ్లి పరిశీలించిన అనంతరమే వారిని ఓటరుగా గుర్తిస్తూ, నిర్ణయం తీసుకున్నారు. పెరిగిన ఓటర్లలో వలస కూలీలతో పాటు యువత, మహిళలే అధికంగా ఉన్నారు. కొత్త ఓటర్లకు త్వరలోనే ఎన్నికల సంఘం నుంచి గుర్తింపుకార్డులు అందనున్నాయి. ఈ మేరకు తాజాగా అనుబంధ జాబితా విడుదల చేయగా, ఇందులో ఓటరుగా నమోదైన వారు మాత్రమే పార్లమెంటు ఎన్నికల్లో ఓటుహక్కు వినియోగించుకునే అవకాశం ఉంటుంది.

**2,194 పోలింగ్ కేంద్రాలు**

పెరిగిన ఓటర్ల కోసం అదనంగా పోలింగ్ కేంద్రాలు కూడా ఏర్పాటు చేసినట్లు జిల్లా ఎన్నికల అధికారులు పేర్కొంటున్నారు. పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలో మొత్తం 2,194 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు వెల్లడిస్తున్నారు. ఎన్నికల సిబ్బందిని కూడా ఈ సారి అదనంగా నియమించి, వారికి శిక్షణ ఇస్తున్నారు. సెగ్మెంట్ పరిధిలో మొత్తం 5,423మంది సిబ్బందిని ఎన్నికల విధుల కోసం వినియోగిస్తుండగా, వీరిలో 1,279 మంది ప్రిసైడింగ్ అధికారులు, 1,304 మంది అసిస్టెంట్ ప్రిసైడింగ్ అధికారులు, 2,656 మంది ఓపీవోలు, 184 మంది ఎంవోలు ఉన్నారు. 8,552 ఈవీఎంలను ఓటర్లు ఓట్లు వేసేందుకు వినియోగించనున్నారు. ఇప్పటికే ఎన్నికల సిబ్బందికి రెండో ర్యాండమైజేషన్ కూడా పూర్తి చేసి, వారిని అసెంబ్లీ నియోజకవర్గాల వారీగా కేటాయించారు. నాలుగు రోజుల క్రితమే ఈవీఎంలను అసెంబ్లీ నియోజకవర్గాలకు తరలించి, స్ట్రాంగ్ రూముల్లో భద్రపరిచారు.

# లోక్‌సభ ఎన్నికల గుర్తులు విడుదల

కలెక్టరేట్, ఏప్రిల్ 27 : సైకిల్ పంపు.. ఇసుర్రాతు.. నులక మంచం.. కంప్యూటర్ మౌస్, ముకుడు.. హెడ్‌ఫోన్.. టైర్లు.. టూత్‌పేస్ట్.. ట్రాక్టర్ నాగళ్లు ఈసారి పార్లమెంట్ ఎన్నికల్లో బ్యాలెట్లపై ఓటర్లకు ఈ గుర్తులు దర్శనమివ్వబోతున్నాయి. లోక్‌సభ ఎన్నికల బరిలో నిలిచే స్వతంత్ర అభ్యర్థులకు ఎన్నికల సంఘం గుర్తులను కేటాయించింది. ఈ మేరకు వాటిని అభ్యర్థులు ఎంచుకునేందుకు వీలుగా రిటర్నింగ్ అధికారి కార్యాలయాల్లో ప్రదర్శిస్తున్నది. ఈ నెల 29న నామినేషన్ల ఉపసంహరణ ప్రక్రియ ముగిసిన తర్వాత పోటీలో ఉండే స్వతంత్రులకు గుర్తులుగా కేటాయించనున్నది. ఈసీఐ ఆమోదించిన 192 రకాల గుర్తులను జిల్లా ఎన్నికల యంత్రాంగం నోటీసు బోర్డులో ప్రదర్శిస్తుండగా, అభ్యర్థులు వీటిలో తమకు అనుకూలమైన వాటిని ఎంపిక చేసుకుని రిటర్నింగ్ అధికారికి జాబితా అందజేయాల్సి ఉంటుంది. ప్రాధాన్యతా క్రమంలో అధికారులు వీటిని అభ్యర్థులకు కేటాయిస్తారు. వీటితోపాటు సీసీ కెమెరాలు, పేపర్ క్లిప్పు, డిష్ యాంటెనా, డ్రిల్ యంత్రం, కోర్ లాకర్, కటింగ్ ప్లేయర్, ప్యాంటు, నెయిల్ కట్టర్ వంటి పలు రకాల గుర్తులు ఈసారి బ్యాలెట్ యంత్రాల్లో అభ్యర్థుల గుర్తులుగా రాబోతున్నాయి. గతంలో కేటాయించిన గుర్తుల్లో అనేకం ప్రధాన రాజకీయ పార్టీలకు కేటాయించిన గుర్తులను పోలి ఉన్నాయి. వాటిని తీక్షణంగా పరిశీలిస్తేనే తప్ప గుర్తు పట్టలేకుండా ఉండడంతో ఆ గుర్తులు కేటాయించిన స్వతంత్ర అభ్యర్థులకు వేల సంఖ్యలో ఓట్లు రావడం, ప్రధాన పార్టీల అభ్యర్థులు ఓటమికి గురికావడం జరిగింది. దీనిని గమనించిన ఎన్నికల సంఘం ఈసారి అలా కాకుండా వాటిని మినహాయించి, కొత్తగా పలు రకాల గుర్తులను తెరపైకి తెచ్చింది. ఈ క్రమంలోనే పైన ఉదహరించిన గుర్తులు కూడా గుర్తింపు పొందిన పార్టీలకు మినహా ఇతర పార్టీలు, స్వతంత్రంగా పోటీ చేస్తున్న అభ్యర్థులకు కేటాయించే జాబితాలో చేరాయి.

# నిప్పుల కొలిమి!



నిర్మానుష్యంగా రామగుండం బల్దియా కార్యాలయం ఎదుట రోడ్డు

భానుడు మండుతున్నడు. వారం పది రోజుల నుంచి అంబటాళ్లకే అగ్గి కురిపిస్తున్నడు. గరిష్ఠంగా 44 డిగ్రీల ఉష్ణోగ్రతలతో అదరగొడుతున్నడు. జిల్లా అంతటా నిప్పుల కొలిమిలా మారుతుండడంతో జనం అల్లాడుతున్నరు. ఉదయం 9గంటల నుంచే ఎండ మండుతుండడంతో ఇండ్ల నుంచి బయటకు వచ్చేందుకు జంకుతున్నరు. కోల్‌బెల్ట్ ఏరియాలో మరింత ఠారెత్తిస్తుండడంతో జనం ఉక్కిరిబిక్కిరవుతున్నారు. వడగాలులకు జనాలు అస్వస్థతకు గురవుతున్నారు. మరో మూడు రోజుల పాటు మరింత ముదిరే అవకాశం ఉందని వాతావరణ శాఖ అధికారులు చెబుతుండడంతో బెంబేలెత్తుతున్నారు. ఏప్రిల్‌లోనే ఇలా ఉంటే మేలో పరిస్థితిని తలచుకొని ఆందోళన చెందుతున్నరు.

**- కోల్‌సిటీ, ఏప్రిల్ 27**

